క్లుప్తంగా

శర్మ కాలేజీని సందర్శించిన మల్లాది విష్ణు


శర్మ కాలేజీని పరిశీలిస్తున్న మల్లాది విష్ణు

ఒంగోలు అర్బన్: సీఎస్ఆర్ శర్మ కాలేజి కమిటీ ఆహ్వానం మేరకు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యాక్షుడు మల్లాది విష్ణు శుక్రవారం కాలేజిని సందర్శించారు. జిల్లాకు వచ్చిన ఆయన్ను ఎన్ఎస్పీ అతిథి గృహంలో స్థానిక బ్రాహ్మణ ప్రముఖులతో సమావేశమై బ్రాహ్మణుల అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. అనంతరం కాలేజిని సందర్శించారు. దీనిలో కరవది రాఘవరావు, గూడా రామ్మోహన్‌రావు, గంజాం శ్రీనివాసమూర్తి, ఓరుగంటి శ్రీనివాసశాస్త్రి, ఉప్పుగుండూరి వాసు, ధేనువకొండ శ్రీనివాసమూర్తి, పుట్టంరాజు రాఘవ, వైఎస్సార్ సీపీ నాయకులు అర్చక సంఘం నాయకులు శ్రీనివాస్, శ్రీనివాసాచార్యులు, ఘడియారం సుబ్బయ్య శర్మ, వేణుగోపాలు, గంగాధర శాస్త్రి, మైనంపాటి సాయి తదితరులు ఉన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు

ఒంగోలు: బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు స్థానిక మినీ స్టేడియంలో శుక్రవారం ముగిసింది. ఈ క్యాంపు మే 2వ తేదీ ప్రారంభమైంది. శిక్షణ ముగించుకున్న 50 మంది క్రీడాకారులకు శ్రీసూర్య హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.సంజీవరెడ్డి షీల్డులు అందించారు. కార్యక్రమంలో సీనియర్ బ్యాడ్మింటన్ కోచ్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా సమ్మర్ క్యాంపుతోపాటు ప్రతి రోజు ఆసక్తి కలిగిన విద్యార్థులకు బ్యాడ్మింటన్‌పై శిక్షణ ఇచ్చి క్రీడాభివృద్ధికి తోడ్పడుతున్నట్లు తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా విజయాలు సాధించినపుడు అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో స్టెప్ చీఫ్ కోచ్ రాజేశ్వరి, అసిస్టెంట్ కోచ్ కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలో విద్యార్థిని ప్రతిభ


బి.షారోన్‌గ్రేస్

ఒంగోలు: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ప్రవేశ పరీక్షలో బైపీసీ విభాగంలో ఒంగోలుకు చెందిన విద్యార్థిని బి.షారోన్‌గ్రేస్ రాష్ట్రస్థాయిలో 207వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. శుక్రవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన శ్రీవికాస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ కె.మోహన్‌రావు, డైరెక్టర్ పి.వీరయ్య అభినందించారు.

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి ప్రాకారోత్సవం


ప్రాకారోత్సవంలో పాల్గొన్న ధర్మకర్తలు, ఆలయ అర్చకులు

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసియున్న ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ఘనంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, ఈమని మదన్‌మోహన్, న్యాయవాది ఐ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథ స్వామి రథోత్సవం

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లిలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమలనాథ స్వామి నామస్మరణతో ఆలయం ప్రాంగణం మార్మోగింది. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీగొడ్రాలి కొండ తిరుమలనాథస్వామిని పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారు రథంపై ఆశీనులయ్యారు. ఉభయదాతలుగా మార్కాపురం పట్టణానికి చెందిన కందుల నారాయణరెడ్డి దంపతులు వ్యవహరించారు.

రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

మార్కాపురం టౌన్: రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ పి.అరుణ చెంచిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏట శ్రీనివాసులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో పాలన సులువు: పి.సుజాత, ఎంపీడీవో, కొత్తపట్నం



సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్జీ పెట్టుకున్న నిర్ణీత సమయంలోనే పరిష్కారం దొరుకుతోంది. నాయకులు, అధికారుల ప్రమేయం లేకుండా, ఎక్కడా అవినీతి జరగకుండా సమస్యలు పరిష్కరిస్తున్నాం.

రెవెన్యూ అర్జీలు పరిష్కరిస్తున్నాం: బీవీ రమణారావు, తహసీల్దార్, కొత్తపట్నం



ఎప్పటి నుంచో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలకు.. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత పరిష్కారం దొరుకుతోంది. రీ సర్వే ప్రారంభమైన తర్వాత హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తున్నాం. దీర్ఘకాలిక సమస్యలు కూడా అజెండాగా పెట్టుకుని ఒక్కోటిగా పనిచేస్తున్నాం.

ఇదిగో గ్రామ స్వరాజ్యం

- సచివాలయాలతో ఆ దిశగా అడుగులు
- కొత్తపట్నం మండలంలో 15 గ్రామ సచివాలయాలతో విస్తృత సేవలు
- 165 మంది సచివాలయ సిబ్బంది


ఆలూరు గ్రామ సచివాలయం

కొత్తపట్నం: గ్రామ సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు అందుతున్నాయి. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమైందని ప్రజలు అభినందిస్తున్నారు. సామాజిక పింఛన్లు ఒకటో తేదీ ఉదయం 5 గంటలకే అందుతున్నాయి. కొత్తపట్నం మండలంలో 15 గ్రామ సచివాలయాలు ఉండగా, వాటిలో 11 శాఖల ఉద్యోగులు పనిచేస్తున్నారు. 15 సచివాలయాల్లో 142 మంది సిబ్బంది ఉన్నారు. మొత్తం మీద 542 రకాల సేవలు అందుతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో అర్జీ పెట్టుకుంటే కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మధ్యవర్తుల చేతిలో మోసపోయిన ఘటనలు చాలా జరిగాయి. కూలి పనులకు వెళ్లకుండా కార్యాలయాల చుట్టూ తిరిగే సంఘటనలు కోకొల్లలు. నేడు పాలన సరళతరమవడంతో అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే భూ విప్లవం


రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఎంపీపీ అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి


కార్యక్రమానికి హాజరైన రైతులు

- కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆర్డీవో విశ్వేశ్వరరావు
- చుక్కల భూములకు హక్కు పత్రాల పంపిణీ
- మండలంలో 1,452 మంది రైతులకు 1,478.45 ఎకరాలు పంపిణీ చేస్తూ పట్టాల అందజేత

కొత్తపట్నం: గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రైతులకు భూమి పంపిణీ చేశామని, మళ్లీ ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా చుక్కల భూముల సమస్య పరిష్కరించి రైతులకు పట్టాలు అందిస్తున్నామని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి కొనియాడారు. 75 సంవత్సరాల నుంచి వెంటాడుతున్న చుక్కల భూమి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించడంతో మండలంలో ఎంతో మంది రైతులకు మేలు జరిగిందన్నారు. మండలంలో 1,452 మంది రైతులకు 1,478.45 ఎకరాల చుక్కల భూములను శాశ్వతంగా కేటాయిస్తూ భూ హక్కు పత్రాలను శుక్రవారం రాత్రి ఆర్డీవో విశ్వేశ్వరరావుతో కలిసి ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో రీ సర్వే జరుగుతోందని, ఎన్ని పనులున్నా భూమి దగ్గరకు వెళ్లి సరిగా కొలతలు కొలిపించుకోవాలని సూచించారు. రైతుకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చుక్కల భూముల సమస్య పరిష్కరించడాన్ని లబ్ధిదారులైన రైతులంతా అదృష్టంగా భావించాలన్నారు.

డీకే భూములకు కూడా త్వరలోనే పరిష్కారం...

మండలంలో ఎక్కువ మందికి డీకే భూములు ఉన్నాయని, క్రయవిక్రయాలు జరిగాయని ఎంపీపీ లంకపోతు అన్నారు. వాటి సమస్య కూడా పరిష్కరించడానికి సీఎం వివిధ రకాల చర్చలు జరుపుతున్నారని, త్వరలో అనుకూలమైన వార్త వస్తుందని అన్నారు. ఎవరైతే భూమిలో ఉన్నారో వారికే చెందే విధంగా, వారి పేరే రీ సర్వేలో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటారని అన్నారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కువ శాతం డీకే భూముల సమస్యలు వెంటాడుతున్నాయని, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. మండలంలో ఇద్దరు ఆర్ఐలు, సర్వేయర్లు లేరని, వెంటనే పోస్టింగ్‌లు వేయాలని ఆర్డీవో విశ్వేశ్వరరావును కోరారు. అనంతరం 1,452 మంది రైతులకు భూ హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ ఏవో మోహన్‌రెడ్డి, హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి


సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్ నుంచి నగరంలోని 70 వార్డు సచివాలయాల సిబ్బందితో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని, రీ సర్వేతో పాటు అనధికారిక లే అవుట్లు, కట్టడాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు మరమ్మతులు, కొళాయి పన్ను వసూళ్లు, క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లు, క్లాప్ టూ పీటీ అనుసంధానంతో పాటు సచివాలయాలపరంగా చేపట్టాల్సిన అన్ని పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. రికార్డులు కచ్చితంగా నిర్వహించాలని, ప్రతిఒక్కరూ ఏకరూపు దుస్తులు ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. సర్వేలకు వలంటీర్లు సహకరించాలన్నారు.

ఎస్ఎస్ ట్యాంకులకు సాగర్ నీరు...

నగరంలోని ఎస్ఎస్ ట్యాంకులకు రామతీర్థం నుంచి సాగర్ నీటిని విడుదల చేశారు. ఆ మేరకు సాగర్ కాలువల ద్వారా వస్తున్న నీటిని కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంకు–1లో నీటి గరిష్ఠ నిల్వ 1950 ఎంఎల్‌కిగానూ ప్రస్తుతం 967.41 ఎంఎల్ ఉందన్నారు. ఎస్ఎస్ ట్యాంకు–2లో నీటి గరిష్ఠ నిల్వ 3750 ఎంఎల్‌కిగానూ ప్రస్తుతం 1434.32 ఎంఎల్ ఉందన్నారు. మరో 20 రోజుల పాటు రామతీర్థం నుంచి నీరు వస్తుందన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం


విద్యార్థినికి చెక్కు అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్ట్ సభ్యులు

ఒంగోలు అర్బన్: పేదరికంతో చదువుకోలేని విద్యార్థిని భవ్యకు సూర్యశ్రీ ట్రస్ట్ రూ.20 వేలు ఆర్థికసాయం అందజేసింది. ఆ మేరకు ట్రస్ట్ సభ్యులు శుక్రవారం విద్యార్థినికి చెక్కు అందజేశారు. కమ్యూనిటీ అసిస్టెన్స్ గ్రూప్ సింగపూర్ కాశీకృష్ణ సహకారంతో ఈ ఆర్థికసాయం అందజేసినట్లు ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా తెలిపారు.

ముగిసిన హాకీ వేసవి శిక్షణ శిబిరం


హాకీ క్రీడాకారులకు సూచనలు చేస్తున్న పీడీ వనజ

చీమకుర్తి: వేసవి సెలవుల్లో దాదాపు నెల రోజుల పాటు సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన హాకీ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీడీ వనజ, పీఈటీ రవికుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే హాకీ పోటీల్లో నైపుణ్యాలు ప్రదర్శించి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యేల నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కరణం బలరాం, టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కరణం వెంకటరాయుడు చిత్రపటానికి చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు శుక్రవారం నివాళులర్పించారు. ఇటీవల వెంకట రాయుడు మృతి చెందడంతో తిమ్మసముద్రం గ్రామంలో జరిగిన దశదినకర్మకు వారు హాజరై బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎడ్ల పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా


ఎడ్లపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

అర్ధవీడు (కంభం): మండలంలోని మోహిద్దీన్‌పురంలో శివాలయం ధ్వజస్తంభం ప్రతిష్ఠ, తిరునాల మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఎడ్ల పందేలను ప్రారంభించారు. తొలుత శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అర్చకులు అందించిన తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్ధవీడు మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్ యాదవ్, మోహిద్దీన్‌పురం, బోగోలు సర్పంచ్‌లు కందుల రామకృష్ణారెడ్డి, డాక్టర్ చేగిరెడ్డి పోతిరెడ్డి, మోహిద్దీన్‌పురం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బన్నీని పరామర్శించిన

ఎమ్మెల్యేలు బాలినేని, బుర్రా


బన్నీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్, తదితర నాయకులు శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ)ని పరామర్శించారు. ఇటీవల బన్నీ కాలికి శస్త్ర చికిత్స జరిగింది. ఆ విషయం తెలుసుకుని అతన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని బాలినేని, బుర్రా సూచించారు. బన్నీ తల్లిదండ్రులతో మాట్లాడి యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. తొలుత ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి బాలినేని, బుర్రాను ఘనంగా సన్మానించారు.

రాజాల ఆదిరెడ్డిని పరామర్శించిన బాలినేని...

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రాజాల ఆదిరెడ్డిని కూడా బాలినేని శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన ఆదిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్తాల జఫన్య, జెడ్పీటీసీ సభ్యులు దద్దాల నారాయణ యాదవ్, గుంట తిరుపతి రెడ్డి, ఓకే రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.మోహన్‌రెడ్డి, ఏపీఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


గర్భిణులకు సూచనలు చేస్తున్న డాక్టర్లు

మద్దిపాడు: గర్భిణులు పౌష్టిక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని మద్దిపాడు పీహెచ్‌సీ సీహెచ్‌వో లలితమ్మ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రసవ సమయానికి 12 గ్రాముల హెచ్‌బీ పర్సంటేజ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే ప్రసవం సులువుగా మారుతుందన్నారు. స్త్రీ గర్భం దాల్చిన రోజు నుంచి వారి పేర్లను గ్రామాల్లో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలోని సీహెచ్‌వోలు గర్భిణులకు సరైన సమయంలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మద్దిపాడు పీహెచ్‌సీలో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సీహెచ్‌వోలకు సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం చేయించుకునే మహిళలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య భరోసా పథకం ద్వారా రూ.5 వేలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు రజితకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

132 దేశాల్లో విస్తరించిన బుద్ధిజం


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బుద్దిస్ట్ సొసైటీ సభ్యులు

చీమకుర్తి: ప్రపంచంలోని 132 దేశాలకు బుద్ధిజం విస్తరించిందని బుద్దిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం చీమకుర్తిలో మండల స్థాయి బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు, కుల వివక్ష లేని మతం బుద్ధిజమన్నారు. కుల వివక్షకు తావులేదు కాబట్టే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించారన్నారు. పంచశీలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల స్థాయి బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షుడిగా బత్తుల అర్జున్, ప్రధాన కార్యదర్శిగా తొట్టెంపూడి వెంకటరాజా, గౌరవ అధ్యక్షులుగా డేవిడ్, సలహాదారులుగా గోళ్ల మధుసూదన్‌రావు, ట్రెజరర్‌గా వేమా వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా ఆవులూరి విజయబాబు, జాయింట్ సెక్రటరీగా తుమ్మా అఖిల్‌తోపాటు మరో 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యుత్ అధికారుల దాడులు


దాడుల అనంతరం మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో అక్రమంగా విద్యుత్ వాడకంపై శుక్రవారం విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఎస్ఈ ఆల్ఫాన్స్, ఈఈ కోటా శ్రీనివాసరావు, ఒంగోలు డివిజన్ ఈఈ డి.శ్రీనివాసులు, డీఈఈ ఆపరేషన్స్ ఆర్.మోహన్‌రావు, ఏఈ రూరల్ ఆర్.ఆర్.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో 34 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలువురికి జరిమానాలు విధించారు. 6 మాల్‌ప్రాక్టీస్ కేసులకు రూ.35 వేల జరిమానా విధించి వసూలు చేశారు. అదనపు విద్యుత్ లోడు వినియోగిస్తున్న 236 మంది వినియోగదారులను గుర్తించి రూ.6,19,000 జరిమానా విధించారు. శుక్రవారం ఒక్కరోజే 2,923 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఒంగోలు రూరల్ వార్డు, గ్రామ విద్యుత్ సహాయకులు, ఒంగోలు నగరంలో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారని రూరల్ ఏఈ ఆర్ఆర్ చెన్నారెడ్డి తెలిపారు.

జాబ్ మేళాలో 52 మంది ఎంపిక

మార్కాపురం: మార్కాపురంలోని సాధన డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 52 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే మధుసూదన్ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్, టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసెస్ సంస్థ వారు నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో మొత్తం 337 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 210 మంది హాజరయ్యారని, వీరిలో 52 మందిని వివిధ ఉద్యోగాలకు కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారని వివరించారు. హెచ్ఆర్ ప్రతినిధులు బీఆర్ కిరణ్, కేవీఎస్ఆర్ పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంపికైన వారికి 21 రోజులపాటు బ్యాంక్ కార్యకలాపాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు.